## క్లుప్తంగా

### 23న ప్రవేశ పరీక్ష

పాణ్యం: మండలంలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో 8వ తరగతి, ఇంటర్మీడియెట్‌కు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈనెల 23న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ మేరీసలోమీ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పరీక్ష ఉదయం 10.30 గంటల నుంచి 1 గంట వరకు ఉంటుందని చెప్పారు.

### కేంద్రం నిర్ణయాలతో పేదలకు నష్టం



తమ్మరాజుపల్లెలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న సీపీఎం నాయకులు

పాణ్యం: కేంద్ర ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయంతో ప్రజలకు నష్టం కలుగుతోందని సీపీఎం మండల కార్యదర్శి భాస్కర్ ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై శుక్రవారం మండల పరిధిలోని తమ్మరాజుపల్లె గ్రామంలో కరపత్రాలు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ.. దేశ సంపదను కార్పొరేట్ కంపెనీలకు దోచిపెడుతున్నారని, సామాన్యులకు దినదిన గండంగా గ్యాస్ ధరలు పెంచుతూ పోతున్నారని విమర్శించారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటీకరణ చేసి దోచుకుంటున్నారన్నారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలను పరిశీలించి కాంపౌండ్ వాల్‌ను నిర్మించాలని డిమాండ్ చేశారు. నాయకులు ప్రతాప్, క్రిష్ణ దేవరాజు, విష్ణు, మధు తదితరులు పాల్గొన్నారు.

### రస్తా ఆక్రమణపై చర్యలు తీసుకోవాలి

ఓర్వకల్లు: రాజకీయ బలంతో పొలానికి రస్తా లేకుండా అడ్డుకుంటున్న కక్షిదారులపై చర్యలు తీసుకోవాలని శకునాల గ్రామానికి ధర్మారెడ్డి, శివారెడ్డి, పద్మావతమ్మ, సుజాతమ్మ అనే రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట బాధిత రైతులు కుటుంబ సమేతంగా దీక్షకు దిగారు. వీరికి సీపీఎం నాయకులు నాగన్న, చంద్రబాబునాయుడు,చాంద్‌బాష,శ్రీధర్ మద్దతుగా నిలిచారు.వారు మాట్లాడుతూ.. రస్తాను ఆక్రమించుకుని రైతులు పొలాలకు వెళ్లకుండా ఇబ్బందులకు గురిచేస్తున్న వారిపై కేసు నమోదు చేసి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. వ్య.కా.స మండల అధ్యక్షుడు చాంద్‌బాష, మహిళా సంఘం నాయకురాలు రమాదేవి, కేవీపీఎస్ మండల అధ్యక్షుడు మద్దిలేటి, శివరాముడు, మంత్ర, మదన్, కాశమ్మ పాల్గొన్నారు.

### సత్యాగ్రహ పోస్టర్ల ఆవిష్కరణ



జై భారత్ సత్యాగ్రహ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కల్లూరు: కార్పొరేట్ గద్దలకు కాపలా కాస్తున్న ప్రధాని నరేంద్రమోదీని గద్దె దించాలని నంద్యాల పార్లమెంట్ జిల్లా డీసీసీ అధ్యక్షులు లక్ష్మీనరసింహయాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం నంద్యాల చెక్‌పోస్టులోని దామోదర్ సంజీవయ్య భవనంలో జై భారత్ సత్యాగ్రహ పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 24వ తేదీన విజయవాడలోని జింఖానా గ్రౌండ్ జరిగే సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పేదల రక్తాన్ని పీల్చి కార్పొరేట్ గద్దల శక్తికి దోహదపడే చట్టాలను చేస్తున్న జిత్తుల మారి మోదీని గద్దె దింపాలని పిలుపునిచ్చారు.

### 'స్పందన' తప్పనిసరిగా నిర్వహించాలి



బ్రాహ్మణదొడ్డి సచివాలయంలో రికార్డులను తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ రాముడు

సి.బెళగల్: మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో ప్రతిరోజూ స్పందన కార్యక్రమం తప్పనిసరిగా నిర్వహించాలని ఎంపీడీఓ రాముడు ఆదేశించారు. ఆయన శుక్రవారం మండల పరిధిలోని బ్రాహ్మణదొడ్డి గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయ రికార్డులు, ఉద్యోగుల హాజరు, సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలు, తదితర రికార్డులను పరిశీలించారు. సచివాలయ పరిధిలో స్పందన అర్జీల నమోదు, పరిష్కార అంశాలను ఉద్యోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సచివాలయంలో ప్రతిరోజు మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు అన్ని శాఖల ఉద్యోగులు అందుబాటులో ఉండి స్పందన కార్యక్రమం తప్పనిసరిగా నిర్వహించాలని, అర్జీదారులు సంతృప్తి చెందేలా, అర్జీలు రీ ఓపెన్ కాకుండా సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

# పాడికి వేడి ముప్పు

- పాల దిగుబడిపై తీవ్ర ప్రభావం
- జాగ్రత్తలు పాటించాలంటున్న నిపుణులు



పశువులను మేతకు తీసుకెళ్తున్న దృశ్యం

కల్లూరు: వేసవిలో ఎండ తీవ్రత రోజురోజుకు పెరుగుతోంది. సాధారణం కంటే ఈ ఏడాది అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రానున్న రోజుల్లో ఎండలు మరింత పెరిగే అవకాశమున్న నేపథ్యంలో పశువులు వడదెబ్బకు గురై ప్రాణాలు కోల్పోయే ప్రమాదముంటుంది. వేసవిలో పాడి పశువుల సంరక్షణపై రైతులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పశుసంవర్ధక శాఖ అధికారులు సూచిస్తున్నారు. అధిక ఉష్ణోగ్రతలు ప్రభావం పశువుల ఆరోగ్యం, పాల ఉత్పత్తి, పునరుత్పత్తి మీద కూడా చూపుతుందని, ఏమాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించినా తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు.

**వడదెబ్బ తగిలిన పశువుల లక్షణాలు**

సాధారణంగా పశువుల శరీర ఉష్ణోగ్రత 99 – 100 ఫారన్‌హీట్ ఉంటుంది. వేసవి ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్నప్పుడు పశువుల శరీర ప్రక్రియ మందగించి వాటి శరీర ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతాయి. ఆవులతో పోల్చితే గేదెలు ఎక్కువ ఉష్ణాన్ని గ్రహించి తక్కువ ఉష్ణాన్ని విసర్జించడం వల్ల తరచుగా గేదెలు వడదెబ్బకు లోనయ్యే అవకాశం ఉంటుంది. చర్మం సున్నితత్వం కోల్పోయి గట్టి పడుతుంది. శ్వాసక్రియ ఎక్కువై గుండె, నాడి వేగం పెరిగి పశువులు రొప్పుతూ ఉంటాయి. కొన్ని పశువులు కిందపడి కొట్టుకుని అపస్మారక స్థితికి చేరుకుంటాయి. వడదెబ్బ ప్రభావంతో పశువుల్లో పాల దిగుబడి తగ్గిపోతుంది. వడదెబ్బ తగిలిన పశువుల శరీర ఉష్ణోగ్రత 103 నుంచి 108 ఫారన్‌హీట్ వరకు పెరుగుతుంది. నోటి నుంచి తెల్లని చొంగకారుస్తాయి. నోరు తెరచి ఇబ్బందిగా శ్వాస పీల్చుకుంటాయి. అలాగే ముఖం మీద చెమ్మ (తడి) ఆరిపోతుంది. కళ్ల కింద పొర (మ్యూకస్ పొర) తెల్లగా పాలిపోయి కళ్ల లోనికి పోతాయి.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

వడదెబ్బ తగిలిన పశువులను నీడ ప్రదేశంలోకి చేర్చి ఉప్పు, బెల్లం కలిపిన నీళ్ల తాపాలి. వీలైనంత పచ్చి గడ్డి తినిపించాలి. పశువులను ఎండపొద్దున పొలం పనులకు తీసుకెళ్లరాదు. మేత మేపేందుకు ఉదయం 6 నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 4.30 నుంచి 6.30 గంటల్లోపు మాత్రమే బయటకు వెళ్లాలి. పాకలో పశువుల మధ్య కొంచెం ఎడం ఉండేటట్లు చూసుకోవాలి. అన్ని వేళల్లో మంచినీరు, మేత అందుబాటులో ఉండేటట్లు చూసుకోవాలి. పశువుల పాక చుట్టూ గోనె సంచులు కట్టి మధ్య మధ్యలో నీళ్ల చల్లడం ద్వారా పాకలోకి వడగాలులు రాకుండా నివారించుకోవచ్చు. పశువులను వీలైనన్ని సార్లు చల్లని నీటితో కడుగుతూ ఉండాలి లేదా నీటి తుంపర్లు పశువుల మీద పడేటట్లు డ్రిప్స్, ఫ్యాన్లు ఏర్పాటు చేస్తే మరీమంచిది. పాల దిగుబడి తగ్గకుండా ఉండాలంటే పచ్చి మేతతో పాటు సమీకృత దాణా అందించాలి. సకాలంలో పశువైద్యులకు తెలియజేసి పశువులు కోలుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలని.

**పాణ్యం నియోజకవర్గంలో పశు సంపద వివరాలు**

| మండలం | ఆవులు/ఎద్దులు | గేదెలు |
|---|---|---|
| కల్లూరు | 5,269 | 6,891 |
| ఓర్వకల్లు | 8,511 | 7,046 |
| గడివేముల | 5,310 | 8,245 |
| పాణ్యం | 4,311 | 5,429 |

**జాగ్రత్తలు తీసుకోవాలి**



వేసవిలో పాడి రైతులు గేదెలు, ఆవులు, ఎద్దుల పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ఉదయం, సాయంత్రం వేళల్లోనే పశువులను మేతకు తీసుకెళ్లాలి. వడదెబ్బ తగిలిన పశువులను గుర్తిస్తే నీడ ప్రదేశంలోకి తీసుకువచ్చి ఉప్పు, బెల్లం కలిపిన నీళ్ల తాపాలి. పశువుల శరీర ఉష్ణోగ్రతలను గమనిస్తూ శరీరంపై నీటిని చల్లుతూ ఉండాలి. పాల దిగుబడి తగకుండా పచ్చిమేత, సమీకృత దాణాను అందిస్తుండాలి.

– శ్రీకాంత్‌రెడ్డి, పశువైద్యుడు, చిన్నటేకూరు

### గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలి



సుగాలిమెట్టలో డ్రైనేజీలను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ రాంబాబు

పాణ్యం: గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలని డీఎల్‌పీఓ రాంబాబు పంచాయతీ అధికారులకు సూచించారు.శుక్రవారం పాణ్యం మండలం సుగాలి మెట్ట గ్రామంలో ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రతి వీధి, ఇళ్లు, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. లీకేజీ సమస్యలు ఉంటే తక్షణమే మరమ్మతులు చేయించాలని, అదనంగా మోటార్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అలాగే గ్రామంలో చెత్త నుంచి వర్మీ కంపోస్టు, సేంద్రియ ఎరువులు తయారుచేసి రైతులకు సబ్సిడీ ధరకు విక్రయించడం ద్వారా గ్రామ పంచాయతీకి సంపద సృష్టించవచ్చన్నారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని ఆదేశించారు. స్పందన కార్యక్రమానికి సిబ్బంది తప్పకుండా హాజరు కావాలన్నారు. సచివాలయ పరిపాలన రిజిస్ట్రార్‌లు తప్పకుండా నమోదు చేయాలన్నారు. అనంతరం గ్రామంలోని డ్రైనేజీ వ్యవస్థ, వర్మీ యూనిట్ షెడ్‌ను పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి సంతోష్‌కుమార్, నాగేంద్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు.



ముడుమాల గ్రామంలో ఇళ్ల నిర్మాణాలపై అధికారులకు సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

# గడప గడపలో నీరాజనం



ఎంపీడీఓలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

సి.బెళగల్: అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలను ఇళ్ల వద్దకే అందిస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కుతుందని ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. ఆయన శుక్రవారం మండలంలోని ముడుమాల గ్రామంలో అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను, ఆయా ఇళ్లకు చేకూరిన లబ్ధిని వివరిస్తూ, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులు తెలిపిన సమస్యలను అధికారులతో నమోదు చేయించి వాటిని వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ఎస్సీ కాలనీలోని ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పక్కా ఇళ్ల నిర్మాణాలు, రైస్ కార్డుల జారీ, పింఛన్ నమోదు, ఇళ్ల పట్టాలు, స్థలాలు, కుళాయిల ఏర్పాటు వంటి అంశాలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, సంక్షేమ పథకాల అమలులో అలసత్వం వహించినా, ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం చేసినా సహించేది లేదని హెచ్చరించారు. ఉద్యోగులు, వలంటీర్లు ప్రజా ప్రతినిధులు సమన్వయంతో వ్యవహరించి ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఎంపీపీ బొంతల మునెప్ప, జెడ్పీటీసీ సభ్యుడు గిరిజోను, సర్పంచ్ బుతుకమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు జగదీశ్వరరెడ్డి, మద్దిలేటి, మహానంది, ఆనందం, సూర్యచంద్ర, ఎంపీడీఓ రాముడు, తహసీల్దార్ శివశంకర్‌నాయక్, ఈఓఆర్డీ సందీప్, వివిధ శాఖల ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

**అర్హులందరికీ పథకాలు అందాలి**

కర్నూలు(న్యూటౌన్):అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించే బాధ్యత అధికారులదేనని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. ఆయన శుక్రవారం సాయంత్రం నియోజకవర్గంలోని నాలుగు మండలాల ఎంపీడీఓలతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని సూచించారు. గ్రామాల అభివృద్ధి, పేద ప్రజల సంక్షేమానికి అధికారులందరూ తమ వంతు కృషి చేయాలన్నారు. ఎంపీడీఓలు ఎస్.భాస్కర్‌నాయుడు, చంద్రశేఖర్, మాధవీలత, రాముడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రంగస్వామి పాల్గొన్నారు.

# స్పందనను సద్వినియోగం చేసుకోండి



రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

కోడుమూరు రూరల్: గ్రామ సచివాలయాల్లో ప్రతి రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ చందశేఖర్ సూచించారు. శుక్రవారం ప్యాలకుర్తి గ్రామ సచివాలయాలను ఎంపీడీఓ చంద్రశేఖర్ ఆకస్మికంగా తనిఖీ చేసి కార్యాలయ రికార్డులతో పాటు, సిబ్బంది హాజరు, మూవ్‌మెంట్ రిజిష్టర్లను పరిశీలించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి రోజు గ్రామ సచివాలయాల్లో తప్పనిసరిగా స్పందన కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి సమస్యలపై అర్జీలను స్వీకరించాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సకాలంలో ప్రజల దరి చేర్చాలని, ఏవైనా సమస్యలుంటే పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.

# జాబ్‌కార్డు ఉన్నవారందరికీ పనులు



వర్కూరులో ఉపాధి పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి

కోడుమూరు రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జాబ్ కార్డు ఉన్న వారందరికీ ఉపాధి పనులు కల్పించనున్నట్లు డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి సూచించారు. మండలంలోని వర్కూరు గ్రామంలో జరుగుతున్న పూడికతీత పనులను శుక్రవారం డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేసి కూలీల హాజరు, పనులు చేస్తున్న విధానాన్ని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలిచ్చారు. పీడీ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో వలసలు నివారించి కూలీలందరికీ పనులు కల్పించాల్సిన బాధ్యత ఉపాధి సిబ్బందిదేనన్నారు. ఎండల దృష్ట్యా కూలీలు ఉదయాన్నే పనుల్లోకి వచ్చి త్వరగా ముగించుకుని వెళ్లాలన్నారు. పనులు చేసే చోట కూలీలకు అవసరమైన వసతులను కల్పించడంతో పాటు, రోజు వారి వేతనం రూ.272లకు తగ్గకుండా ఉండేలా పని కల్పించాలని ఉపాధి ఈసీ వెంకటేశ్వర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించారు. మండలంలోని గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులపై ఆరా తీశారు. పనుల కల్పనలో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని పీడీ హెచ్చరికలు జారీ చేశారు.

# ప్లాస్టిక్ ముప్పు



బస్తిపాడు చింతవనంలో ప్లాస్టిక్ కవర్లు, చెత్త చెద్దారం

కల్లూరు:మండలంలోని బస్తిపాడు చింతవనం, ఆ పరిసరాల్లో ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ సంచులు, చెత్త చెదారంతో నిండి పర్యావరణానికి తీవ్రనష్టం కలిగిస్తోంది. ఇక్కడి చెట్లకింద మందుబాబులు మద్యం సేవిస్తూ ఇష్టానుసారంగా వాటర్ ప్యాకెట్లు, ప్లాస్టిక్ కవర్లను అక్కడే పారేస్తుండడంతో చెత్త దిబ్బను తలపిస్తోంది. ప్లాస్టిక్ కవర్లను తొలగించడంతో పాటూ మందుబాబుల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

# సమస్యల పరిష్కారమే ధ్యేయం



కృష్ణానగర్‌లో లబ్ధిదారురాలికి సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు:ప్రజల సమస్యలు పరిష్కరించేందుకే గడప గడపకు వస్తున్నామని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం కల్లూరు అర్బన్ 27వ వార్డు 68వ సచివాలయం పరిధిలోని కృష్ణానగర్‌లో స్థానిక కార్పొరేటర్ పి.శారద ఆధ్వర్యంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యేకు స్థానిక నాయకులు, కాలనీ వాసులు ఆత్మీయ స్వాగతం పలికారు. కాలనీలో ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించారు. కాలనీలో ఏమైనా సమస్యలుంటే తనకు తెలియజేయాలన్నారు. సంక్షేమ పథకాలను సచివాలయ సిబ్బంది, వలంటీర్లు సకాలంలో అందిస్తున్నారా ? లేదా ? అని అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నేరవేర్చారని, సంక్షేమ పాలన సాగిస్తున్న జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కాలనీ వాసులు కుళాయిల్లో కలుషిత నీరు వస్తోందని చెప్పగా సమస్యను పరిష్కరించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. డ్రైనేజీ కాలువలు, రోడ్లు నిర్మించాలని కోరగా నగరంలో ప్రాధాన్యతలను అనుసరించి అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. డిప్యూటీ మేయర్ ఎస్.రేణుక, కార్పొరేటర్లు శ్రీనివాసులు, సుదర్శన్‌రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, అరుణ, చిట్టెమ్మ, డీసీఎబీ చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, నాయకులు శివశంకర్‌రెడ్డి, పుల్లారెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, శివ, సత్యం యాదవ్, సబిహా సుల్తానా, సుబ్రహ్మణ్యం, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దుదాం**

గడివేముల: గ్రామాలలో సమస్యలు పరిష్కరించి ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు.మండల పరిధిలోని తిరుపాడు గ్రామంలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలువురు పింఛన్లు, ఇంటి పట్టాలు, రోడ్లు, డ్రైనేజీలు, ఇళ్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడి అర్హత కలిగిన వారందరికీ పథకాలు మంజూరు చేయాలని, గ్రామంలోని సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి, ఎంపీపీ నాగమద్దమ్మ, సర్పంచ్ బాలలింగమ్మ, తహసీల్దార్ శ్రీనివాసులు, ఏఓ హేమసుందర్‌రెడ్డి, ఏఈ భాస్కర్, సింగిల్ విండో చైర్మన్ పోగుల చంద్రశేఖరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు శివరామి రెడ్డి, రఘుమాధవ రెడ్డి, కృష్ణారెడ్డి, వెంకటేశ్వర్లు, భూపాల్, ఎల్లారెడ్డి, పుల్లయ్య, డాలుస్వామి తదితరులు పాల్గొన్నారు.

**అల్లా చూపిన మార్గంలో నడవాలి**

గడివేముల: అల్లా చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి గని గ్రామ ఉప సర్పంచ్ శివానందరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ అల్లా ప్రబోధించిన ప్రకారం ఇతరుల పట్ల ప్రేమ, కరుణ, సోదరభావం కలిగి ఉండాలన్నారు. రంజాన్ మాసంలో ప్రతి ఒక్కరూ వారి శక్తిమేరకు దానం చేయడం వలన దేవుడి కృపకు పాత్రులవుతారన్నారు. అనంతరం ముస్లింలతో పాటు ఎమ్మెల్యే ప్రార్థనలో పాల్గన్నారు. ఇఫ్తార్ విందు స్వీకరించారు. సర్పంచ్ కత్తి తులషమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

### కార్మికుడి దుర్మరణం

పాణ్యం: మండల పరిధిలోని పిన్నాపురం గ్రామ సమీపంలో జరుగుతున్న గ్రీన్‌కో సోలార్ ప్రాజెక్టు పనుల్లో భాగంగా ప్రమాదవశాత్తు కిందపడి కార్మికుడు మృతి చెందినట్లు హెడ్‌కానిస్టేబుల్ సత్యం శక్రవారం తెలిపారు. వివరాలు..కాకినాడకు చెందిన గడ్డం మణికంఠ (27)గ్రీన్‌కో పరిశ్రమలో కార్మికుడిగా పని చేస్తున్నారు. కొలతలు వేస్తున్న తరుణంలో ప్రమాదవశాత్తు జారి గుంతలో పడినట్లు చెప్పారు.గుర్తించిన తోటి కార్మికులు బయటకు తీసి చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా కోలుకోలేక మృతి చెందినట్లు తెలిపారు.మృతుడి తమ్ముడు సత్యప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

### రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు



గాయపడిన యువకులను అంబులెన్స్‌లో తరలిస్తున్న దృశ్యం

గడివేముల:మండల పరిధిలోని మంచాలకట్ట రస్తాలో రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఎల్‌కే తాండ గ్రామానికి చెందిన యువకులు కేశాలు నాయక్, బాబునాయక్ గడివేములకు వచ్చి ఇంటికి తిరిగి వెళ్తుండగా ఎదురుగా వచ్చిన టాటా ఏసీ అటో ఢీకొట్టింది. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అదించారు. అంబులెన్స్ అక్కడికి చేరుకోగా తీవ్రగాయాల పాలైన ఇద్దరిని చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాదంపై స్థానిక పోలీసులు విచారణ చేపట్టారు.

# ఆలయ నిర్మాణం చరిత్రాత్మకం




ఆలయ నిర్మాణ విశేషాలను తెలుసుకుంటున్న ఎమ్మెల్సీ ఎంవీ.రామచంద్రారెడ్డి

కోడుమూరు రూరల్: కోడుమూరులో నిర్మిస్తున్న పంచాయతన దేవతల సహిత శ్రీలక్ష్మి వేంకటేశ్వర ఆలయ పునర్నిర్మాణం చరిత్రలో నిలిచిపోతుందని ఎమ్మెల్సీ, ఏపీ ప్రైవేట్ పాఠశాలల కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ.రామచంద్రారెడ్డి అన్నారు. ఆలయ చైర్మన్ ఎద్దుల మహేశ్వరరెడ్డి దాతల సహకారంతో రూ.9 కోట్ల వ్యయంతో పురాతన పద్ధతిన కోడుమూరులో పూర్తిగా రాతిశిలలతో నిర్మిస్తున్న శ్రీలక్ష్మి వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని శుక్రవారం ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి సందర్శించి ఆలయ నిర్మాణ విశేషాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పూర్తిగా రాతి దూలాలు, శిలలు, శిల్పాలతో పురాతన పద్ధతిలో ఆలయాన్ని నిర్మిస్తుండడం గొప్ప విషయమన్నారు. ఆలయ నిర్మాణం చరిత్రలో నిలిచిపోతుందని, నిర్మాణానికి తన వంతు సహకారం అందిస్తానని పేర్కొన్నారు.

**గుర్తింపు పొడిగించేలా కృషి**

అనంతరం పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు నిర్వహించిన సమావేశాన్ని ఉద్దేశించి ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ పాఠశాలలకు ఇచ్చే గుర్తింపును మూడేళ్ల నుంచి ఎనిమిదేళ్లకు పెంచేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అపుస్మా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇంతియాజ్ బాషా, జిల్లా అధ్యక్షుడు వాసు దేవయ్య, సభ్యులు శ్రీనివాసరెడ్డి, సుబ్బయ్య, నాగార్జున యాదవ్, రాముడు, కృష్ణయ్య, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

### రైలు పట్టాలపై మహిళ మృతదేహం



రైలు పట్టాలపై పడిఉన్న మృతదేహం

కర్నూలు: కర్నూలు రైల్వేస్టేషన్ నుంచి హైదరాబాద్‌కు వెళ్లే మార్గంలో రోజా వీధి సమీపంలో రైలు పట్టాలపై మహిళ మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. శుక్రవారం ఉదయం 242/1-2 కిలోమీటర్ వద్ద గుర్తు తెలియని మహిళ మృతదేహం పడి ఉన్నట్లు స్థానికులు సమాచారమివ్వడంతో రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సదరు మహిళ రైలు నుంచి ప్రమాదవశాత్తు కింద పడి ఉండొచ్చని భావిస్తున్నారు. సుమారు 45 సంవత్సరాల వయస్సు ఉండి 5.3 అడుగుల ఎత్తు, తెలుపు రంగు ఉంది. రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ నాగేంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ శ్రీనివాసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గ్రీన్ కలర్ పంజాబీ డ్రస్సు, ఆకుపచ్చ రంగు లోయర్, పింక్ కలర్ ఐపీఎల్ నైట్ రైడర్స్ టీషర్టు, తలకు బ్లూ స్కార్ఫ్ ధరించింది. మృతురాలి ఆచూకీ తెలిసినవారు 94417 59875కు ఫోన్ చేసి సమాచారం అందించాలని ఏఎస్ఐ శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు.

### మట్టి పరీక్షలు చేయించుకోవాలి

కోడుమూరు రూరల్: రైతులంతా తమ పొలాల్లోని మట్టిని పరీక్ష చేయించుకోవాలని ఏఓ రవిప్రకాష్ సూచించారు. శుక్రవారం మండలంలోని గోరంట్ల, ముడుమలగుర్తి ఆర్బీకేలను ఏఓ రవిప్రకాష్ సందర్శించి రైతులతో మాట్లాడారు. రైతులు మట్టి పరీక్షల ఫలితాల ఆధారంగా ఎరువుల వాడకం, పంటలను సాగు చేసుకోవాలన్నారు. కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలు వచ్చిన రైతుల రైతు భరోసా పథకం కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎవరైనా లూజు పత్తి విత్తనాలు అమ్మితే సమాచారం ఇవ్వాలని, విక్రేతలపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్‌బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

### పనిచేయని కీబోర్డులతో పరీక్ష

కర్నూలు(సిటీ): హైకోర్టు ఆధ్వర్యంలో పరీక్ష పాసైన టైపిస్టు, కాపీయిస్టు అభ్యర్థులకు శుక్రవారం టైపింగ్ స్క్రీనింగ్ టెస్టును నందికొట్కూరు రోడ్డులోని అయాన్ డిజిటల్ కాలేజీలో నిర్వహించారు. కర్నూలు, అనంతపురం జిల్లాలకు చెందిన దాదాపు వంద మంది పరీక్షకు హాజరు కాగా కంప్యూటర్ల కీబోర్డులు సరిగా పని చేయకపోవడంతో అభ్యర్థులు ఆందోళనకు దిగారు. సమస్యను జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాష్ట్ర హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఉన్న పరికరాలతోనే పరీక్ష నిర్వహించడంతో అభ్యర్థులు చేసేదేమీ లేక పరీక్ష పూర్తి చేశారు. అయాన్ డిజిటల్ సంస్థ నిర్లక్ష్యంపై హైకోర్టు దృష్టికి తీసుకెళ్తామని పలువురు అభ్యర్థులు తెలిపారు.